WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705


మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక

www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 101 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 31 మే 2026 | వెల : 2-00



# ‘సర్’పై అప్రమత్తంగా ఉండండి

## తెదేపా ఓట్లు తొలగించేలా వైకాపా కుట్రలకు పాల్పడవచ్చు

- 2019కి ముందు తెదేపా అధికారంలో ఉన్నప్పటికీ, వైకాపా కుట్రపూరితంగా తెదేపా సానుభూతిపరుల ఓట్లను తొలగించేలా చేసింది
- మహానాడు స్ఫూర్తితో ప్రతి మూడు నెలలకు ఒకసారి క్లస్టర్ స్థాయిలో వర్చువల్ సమావేశాలు నిర్వహిద్దాం
- 2న తెదేపా ఎమ్మెల్యేలకు వర్క్‌షాప్
- ముఖ్య నేతలతో చంద్రబాబు

అమరావతి, స్వర్ణసాగరం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై బూత్ స్థాయి ఏజెంట్లను అప్రమత్తం చేయాలనీ పార్టీ నాయకులకు తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 2019కి ముందు తెదేపా అధికారంలో ఉన్నప్పటికీ, వైకాపా కుట్రపూరితంగా తెదేపా సానుభూతిపరుల ఓట్లను తొలగించేలా చేసిందని గుర్తుచేశారు. ఈసారి కూడా వైకాపా అలాంటి కుట్రలకు పాల్పడే అవకాశముందని, పార్టీ శ్రేణులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ‘సర్’పై అవగాహన కల్పించేందుకు జూన్ 2న పార్టీ కేంద్ర కార్యాలయంలో తెదేపా ఎమ్మెల్యేలకు వర్క్‌షాప్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో చంద్రబాబు - మిగతా2లో



## ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు
- అమరావతిలో 25వేల మందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం

3



## “విశ్వగురువు అని ప్రగల్భాలు పలకడమే

- ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేరు”
- మోదీపై రాహుల్ విమర్శలు
- దేశంలో విద్యావ్యవస్థ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయింది
- దేశానికి చదువుకున్న ప్రధానమంత్రి అవసరం ఎంతైనా ఉంది
- కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు

2



## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

- జూన్ 3న ప్రమాణస్వీకారం
- జూన్ 3న డీకే ప్రమాణస్వీకారం
- స్వయంగా ప్రకటించిన కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్

## రాజస్థాన్‌లో ఇసుక తుపాన్ బీభత్సం



# రైల్వేజోన్‌కు సర్వం సిద్ధం

- దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభానికి ఏర్పాట్లు
- సరిహద్దుల్లో బోర్డులు మారుస్తున్న సిబ్బంది
- మూడు జోన్లలోనూ ఆదివారం సెలవు రద్దు చేసిన రైల్వే బోర్డు
- ఉద్యోగులంతా ఏర్పాట్లలో విధిగా పాల్గొనాలని ఆదేశాలు
- విశాఖపట్నానికి రైల్వే ఉన్నతాధికారులు
- నేడు విశాఖ రైల్వే జోన్ కార్యాలయంలో జీఎంల అత్యవసర సమావేశం

3






## కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో భారీ రద్దీ

- ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న చార్‌ధామ్ యాత్ర
- కేథార్‌నాథ్ ధామ్‌కు భారీగా తరలివస్తున్న భక్తులు
- ఆ నడక మార్గంలో భారీగా రద్దీ
- దీంతో ఇబ్బంది పడుతున్న వృద్ధ భక్తులు, చిన్నారులు

2

## ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలో ఎస్ఐఆర్ ఒకటి

- విపక్షాల విమర్శల వేళ సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- గత కొంతకాలంగా ఎస్ఐఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న విపక్షాలు
- సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు”

2



## వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు మరిన్ని అవసరం

- కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు
- జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, మహానగర్

‘చెత్త నుంచి సంపద సృష్టించే మార్గాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి. వ్యర్థాల ద్వారా విద్యుత్ తయారీ ప్రక్రియ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా, పర్యావరణ హితంగా ఉంటుంది. చెత్త సేకరణ ఓ క్రమపద్ధతిలో చేపట్టి, వినియోగిస్తే అద్భుతాలు చేయొచ్చు’ అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాన్ని - మిగతా2లో



## ఆపరేషన్ సింధూర్ 2.0’కు భారత్ సన్నద్ధం

- త్రివిధ దళాలు అలర్ట్ అన్న ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది!
- భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సంచలన వ్యాఖ్యలు
- శత్రు దేశాల కుతంత్రాలను తిప్పికొట్టేందుకు, దేశ రక్షణే ధ్యేయంగా భారత్ ‘ఆపరేషన్ సింధూర్ 2.0’కు సన్నద్ధమవుతోంది
- కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ చర్యలకు ప్రతిస్పందనగా భారత్ అవలంబించిన కఠిన సైనిక వైఖరి ఇంకా కొనసాగుతూనే ఉంది

2

# రాజస్థాన్‌లో ఇసుక తుపాన్ బీభత్సం

రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు, బికనేర్ ప్రాంతాలను ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. సునామీ తరహాలో భారీ ఈదురు గాలులతో నివాస ప్రాంతాలను ఇసుక ముంచెత్తింది. ఇసుక తుపానుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుపాను ధాటికి పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది.



**పట్టపగలే కమ్ముకున్న చీకట్లు**

రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఆకాశాన్ని భారీ ధూళి మేఘాలు కమ్మేయడంతో పట్టపగలే రాత్రిని తలపించింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భయంకరమైన ఇసుక తుపాను విరుచుకుపడింది. సుడిగాలిలా చెలరేగిన భారీ ధూళి మేఘాలు ఆకాశాన్ని పూర్తిగా కప్పేశాయి. విపరీతమైన వేగంతో గాలులు వీయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై కొద్ది మీటర్ల దూరం కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనాలు హెడ్‌లైట్ల సాయంతో మెల్లగా కదిలాయి.

**భారీ వర్షం**

ఇసుక తుపానుకు స్థానిక మార్కెట్లలో గందరగోళం నెలకొంది. బలమైన గాలులు, ఇసుక తుపాన్ నుంచి రక్షించుకునేందుకు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఈ భీకర గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వడగళ్ల వర్షం కురిసింది. దట్టమైన ఇసుక తుఫాను, భారీ వర్షం కారణంగా స్థానికుల రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సర్దార్‌షహర్ ప్రాంతంలో ధూళి మేఘాల తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆకాశాన్ని ఇసుక మేఘాలు పూర్తిగా కమ్మేయడంతో, పట్టపగలే దట్టమైన చీకట్లు అలుముకున్న దృశ్యాలు చూపరులను భయాందోళనలకు గురిచేశాయి.

**మరో 4–5 రోజులపాటు ఇదే పరిస్థితి**

వెస్ట్రన్ డిస్టబెన్స్ వల్ల రాజస్థాన్‌లో మరో 4,5 రోజులపాటు ఇదే విధంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో ఇసుక తుపానులు కూడా కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు వద్దని శనివారం సూచించింది.

వాస్తవానికి గడచిన 24 గంటల్లో రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులతో కూడిన తుపానులు, వర్షాలు సంభవించాయి. కాగా ధోల్‌పూర్ జిల్లాలోని బారి ప్రాంతంలో అత్యధికంగా 58 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జైపుర్‌లోని వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం, బికనీర్, జైపుర్, అజ్మీర్, భరత్‌పూర్, కోట, జోధ్‌పూర్, ఉదయ్?పుర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు గంటకు 60 నుంచి 70 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తర వర్షాలు పడే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఇంకొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలతోపాటు పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది. రాష్ట్రంలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని, కనుక ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా, చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఇది తీవ్ర వేడిమి, వడగాల్పుల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

**ఇంతకీ వెస్ట్రన్ డిస్టర్బెన్స్ అంటే ఏమిటి?**

వెస్ట్రన్ డిస్టర్బెన్స్ అనేది మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఏర్పడి, భూమికి అత్యంత ఎత్తులో వీచే జెట్ స్ట్రీమ్స్ అనే బలమైన పశ్చిమ గాలుల ద్వారా భారత ఉపఖండం వైపు కొట్టుకువచ్చే ఒక అల్పపీడన వ్యవస్థ. పశ్చిమ దిశ నుంచి ప్రయాణిస్తూ కాస్పియన్, అట్లాంటిక్ మహాసముద్రాల నుంచి తేమను గ్రహించే ఈ తుపాను వ్యవస్థ, హిమాలయ పర్వతాలను ఢీకొన్నప్పుడు జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ వంటి ఉత్తర పర్వత ప్రాంతాలలో భారీ హిమపాతాన్ని, అలాగే పంజాబ్, హరియాణా, రాజస్థాన్, దిల్లీ వంటి మైదాన ప్రాంతాలలో అకాల వర్షాలు, ఈదురు గాలులు, ఇసుక తుపానులను తీసుకువస్తుంది. శీతాకాలంలో కురిసే ఈ వర్షాలు భారతదేశంలో రబీ పంటలకు (ముఖ్యంగా గోధుమలకు) ఎంతో మేలు చేకూరుస్తాయి. కానీ ఎండాకాలంలో దీని వల్ల తీవ్రమైన దుమ్ము తుపానులు, వడగళ్ల వానలు పడతాయి. దీని చాలా వరకు ఆస్తి నష్టాన్ని, కొన్నిసార్లు ప్రాణనష్టానికి కారణమవుతుంటాయి.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. అయితే కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.



**జూన్ 3న ప్రమాణ స్వీకారం**

కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్ చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

**గవర్నర్‌తో డీకే భేటీ**

కాగా, డీకే శివకుమార్ ఈ రోజు ఉదయం? లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే, గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**మంత్రివర్గంలో సిద్ధరామయ్య కొడుకు?**

శివకుమార్? సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎందకంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం దిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

**సీఎం మార్పు వల్ల నో యూజ్**

కర్ణాటక కాంగ్రెస్? సర్కార్?పై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్? బొమ్మై శనివారం విమర్శల వర్షం కురిపించారు. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో అర్థవంతమైన మార్పు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కర్ణాటక భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సరైన పాలన లేకపోవడం, అభివృద్ధి శూన్యం కావడం వల్ల ప్రజల్లో, ముఖ్యంగా ఓబీసీ సామాజిక వర్గంలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. వారి అసంతృప్తి భవిష్యత్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని జోస్యం చెప్పారు. "ప్రస్తుతం రాష్ట్రం భారీ రుణాల భారంతో కొట్టుమిట్టాడుతోంది. సుపరిపాలన, అభివృద్ధి లేక ప్రజల్లో నైరాశ్యం అలముకుంది. ప్రజలు, ప్రత్యేకించి ఓబీసీ వర్గం నిరంతరం నిరాశకు గురవుతున్నారు. అది ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుంది" అని బొమ్మై హెచ్చరించారు. సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కర్ణాటక కాంగ్రెస్?లో నాయకత్వ మార్పు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తరుణంలో బొమ్మై ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కాగా, సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్?చంద్ గెహ్లోత్? ఆమోదించడంతో పాటు మంత్రిమండలిని కూడా రద్దు చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్యను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా ఈ రోజు సాయంత్రం జరగనున్న సీఎల్?పీ సమావేశంలో డీకే శివకుమార్?ను లాంఛనగా ముఖ్యమంత్రిగా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది. ఇది కాస్త సజావుగా సాగితే, ఆ తర్వాత రాజ్యసభ నామినేషన్లు, ఎమ్మెల్సీ పదవులతో సహా కీలక నియామకాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

# దిగువపుత్తూరులో దళితుల ఇంటి స్థలాల పరిరక్షణకు జనసేన

## గ్రామకంఠం భూముల ఆక్రమణపై పవన్ కళ్యాణ్ కి ఫిర్యాదు

**స్వర్ణసాగరం కె వి బి పురం:**

కేవీబీపురం మండలం దిగువపుత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 61/2పి లోని 18 ఎకరాల గ్రామకంఠం భూముల ఆక్రమణపై జనసేన పార్టీ పోరాటం ప్రారంభించింది. ఈ 18 ఎకరాలలో బీసీ కాలనీ పాఠశాలకు 6 ఎకరాలు పోను, మిగిలిన 12 ఎకరాలలో అదే గ్రామానికి చెందిన కొందరు ఓసీ, బీసీ వర్గాల వారు సుమారు 8 ఎకరాలను ఇప్పటికే అనధికారికంగా ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన 4 ఎకరాల భూమిని కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామ దళితులు జనసేన పార్టీ కేవీబీపురం మండల అధ్యక్షులు వి. థామస్ దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే థామస్ స్పందించి, బాధిత దళిత కుటుంబాలతో కలిసి ఆర్డీఓ యమ్ఆర్ఓ తో పాటు యస్సి కమిషన్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. స్థానికంగా ఇల్లు లేని దళిత కుటుంబాలకు మిగిలిన 4 ఎకరాలను ఇంటి స్థలాలుగా కేటాయించి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. శనివారం దిగువపుత్తూరు గ్రామ దళితులతో కలిసి మండల అధ్యక్షులు వి. థామస్ ఈ సమస్యను జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు.



**జనసేన పార్టీ డిమాండ్లు**

సర్వే నం. 61/2పి లో మిగిలి ఉన్న 4 ఎకరాల గ్రామకంఠం భూమిని వెంటనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి. ఇల్లు లేని అర్హులైన స్థానిక ఎస్సీ కుటుంబాలకు ఇంటి స్థలాలుగా పంపిణీ చేయాలి. ఇప్పటికే జరిగిన 8 ఎకరాల అక్రమ ఆక్రమణలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అర్హులందరికీ పట్టాలు మంజూరు చేసి స్థలంలోకి ప్రవేశం కల్పించాలి. "ప్రభుత్వ భూమి పేదలందరికీ చెందాలి. దళితుల హక్కులను కాలరాస్తే జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదు. పవన్ కళ్యాణ్ ఆశయం సామాజిక న్యాయం. ఆ న్యాయం దిగువపుత్తూరు దళితులకు జరిగే వరకు మా పోరాటం ఆగదు" అని వి. థామస్ అన్నారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సంబంధిత అధికారులకు ఆదేశాలు వెళ్తాయని జనసేన నాయకులు తెలిపారు.

## ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలో ఎస్ఐఆర్ ఒకటి

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న వేళ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒకటని అభిప్రాయపడ్డారు. రేయింబవళ్లు ప్రతికూల ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ పూర్తి పారదర్శకతతో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నందుకు ఎన్నికల అధికారులను ప్రశంసించారు. దిల్లీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్ కుమార్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"15 లక్షలకు పైగా బూత్ స్థాయి ఏజెంట్లు, అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల జిల్లా, రాష్ట్ర అధ్యక్షుల పర్యవేక్షణలో 11 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రూపొందిస్తున్నారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్నవారందరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. వారందరూ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒక దానిని తయారుచేయడానికి ఎన్నికల సంఘానికి డిప్యూటేషన్‌పై ఉన్నారు. సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సింధూర్ 2.0'కు భారత్ సన్నద్ధం

భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం (మే 30) సంచలన వ్యాఖ్యలు చేశారు. శత్రు దేశాల కుతంత్రాలను తిప్పికొట్టేందుకు, దేశ రక్షణే ధ్యేయంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్ 2.0'కు సన్నద్ధమవుతోందని ఆయన స్పష్టం చేశారు. కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ చర్యలకు ప్రతిస్పందనగా భారత్ అవలంబించిన కఠిన సైనిక వైఖరి ఇంకా కొనసాగుతూనే ఉందని ఆయన తెలిపారు. మీడియా సంస్థ 'ఏఎన్ఐ'తో మాట్లాడిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆపరేషన్ సింధూర్ ఇంకా కొనసాగుతోంది అని స్పష్టం చేశారు. ప్రస్తుత సరిహద్దు పరిస్థితిని ఆయన తాత్కాలిక ఘర్షణల విరమణగా అభివర్ణించారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే శత్రుదేశానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ భవిష్యత్తులో కొత్త ఆపరేషన్ చేపట్టాల్సి వస్తే, కేవలం ఆర్మీ మాత్రమే కాకుండా ఎయిర్ ఫోర్స్, నావికా దళాలు సైతం ఉమ్మడిగా దాడికి సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు. తదుపరి యుద్ధం కోసం త్రివిధ దళాలు 24గంటలు సన్నద్ధతతో ఉన్నాయని, వాటి మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందిస్తున్నామని తెలిపారు. ఆధునిక యుద్ధ తంత్రం గురించి మాట్లాడుతూ.. "ప్రస్తుత రోజుల్లో యుద్ధభూమి చాలా పారదర్శకంగా మారింది, మన ప్రతి కదలిక అవతలి వారికి తెలిసిపోతుంది. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో మన సైనికులను, పౌరులను రక్షించడానికి అవసరమైన వ్యూహాత్మక రక్షణ, సైన్య మోహరింపు విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి" అని ఆర్మీ చీఫ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, కేవలం సరిహద్దుల్లోనే కాకుండా సమాచార యుద్ధంలో గెలవడం కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. దేశం మొత్తం ఏకమై, అధికారిక సమాచారాన్ని విశ్వసించినప్పుడే సమాచార యుద్ధంలో విజయం సాధించగలమని, అలాంటి ఐక్యత ఉన్న దేశం ఎల్లప్పుడూ యుద్ధంలో గెలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**అసలేమిటి ఈ ఆపరేషన్ సింధూర్?**

గత ఏడాది, అంటే 2025 మే 7 -- మే 8 మధ్య రాత్రి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి బలమైన ప్రతీకారంగా భారతదేశం 'ఆపరేషన్ సింధూర్'ను ప్రారంభించింది. అంతకుముందు ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని పహల్గామ్, బైసారన్ లోయలో పాకిస్థాన్ మద్దతు గల ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ ఉగ్రదాడికి గట్టి బుద్ధి చెప్పడానికే భారత సైన్యం ఈ ఆపరేషన్ చేపట్టింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా పార్ట్–2 ఆపరేషన్ సింధూర్ 2.0కు కూడా త్రివిధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో భారీ రద్దీ

ఉత్తరాఖండ్‌లో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్‌కు భక్తులు పోటెత్తుతున్నారు. బాబా కేదార్‌నాథ్‌ను చూసేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్లే 19 కిలోమీటర్ల పొడవైన కాలినడక (ట్రెక్కింగ్) మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ కాలినడక మార్గంలో నెలకొన్న రద్దీకి సంబంధించిన అనేక వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఇవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కేదార్‌నాథ్ ధామ్ ట్రెక్కింగ్ మార్గంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు తీర్థయాత్ర నిర్వహణ, భక్తుల భద్రతకు సంబంధించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ నడక మార్గంలోని భీంబలి, లించోలి, జంగల్‌చట్టి వంటి కీలక ప్రాంతాల్లో దారి అత్యంత ఇరుకుగా ఉండటం వల్ల భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఓవైపు వేలాది మంది భక్తులు బాబా కేదార్‌నాథ్ ఆశీస్సుల కోసం కాలినడకన ఈ కఠినమైన యాత్రను సాగిస్తున్నారు. మరోవైపు గుర్రాలు, డోలీలు (పల్లకీలు), స్థానిక సేవా ప్రదాతల రాకపోకలు వివిధ ప్రదేశాలలో రద్దీని మరింత పెంచుతున్నాయి. ఫలితంగా భక్తులు గంటల తరబడి రద్దీలో చిక్కుకుని, ముందుకు సాగడానికి దారి క్లియర్ అయ్యేంత వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, తుంగనాథ్ ధామ్ వద్ద భక్తుల మధ్య జరిగిన ఘర్షణలకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో పరిపాలనాపరమైన ఏర్పాట్ల సమర్థతపై తీవ్రమైన చర్చ మొదలైంది. కేథార్‌నాథ్ ధామ్ కాలినడక మార్గంలో రద్దీకి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోల్లో భారీ సంఖ్యలో భక్తులు ఒకరి వెనుక ఒకరు అతి దగ్గరగా నిలబడి పొడవైన క్యూలలో వేచి ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది. భీంబలి, లించోలి ప్రాంతాల్లో పరిస్థితి మరీ క్లిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ దారి ఇరుకుగా ఉండటం వల్ల రాకపోకలకు తరచుగా అంతరాయాలు కలుగుతున్నాయి. వృద్ధ భక్తులు, మహిళలు, చిన్న పిల్లలతో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**భద్రతపై భక్తులు ఆందోళన**

మరోవైపు, కాలినడక మార్గంలో భద్రతా ఏర్పాట్లు ఆశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేవని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లోనూ, లోతైన లోయలకు ఆనుకుని ఉన్న మార్గాల్లోనూ తగినంత బారికేడింగ్, భద్రతా మౌలిక సదుపాయాల కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జనాభా నియంత్రణ, యాత్ర నిర్వహణ కోసం పోలీసులు, భద్రతా సిబ్బందిని తగినంతగా మోహరించలేదని ఆరోపిస్తున్నారు. యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి, సున్నితమైన ప్రదేశాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని, పటిష్ఠమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ట్రెక్కింగ్ మార్గం వెంబడి సమర్థవంతమైన జన నియంత్రణ యంత్రాంగాలను అమలు చేయాలని భక్తులు అధికారులను కోరారు. ప్రస్తుతం, కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో పెరుగుతున్న జనసందోహం, తరచుగా ఏర్పడుతున్న రద్దీ పరిస్థితులు భక్తులకు ఆందోళన కలిగిస్తున్నాయి. కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసు సూపరింటెండెంట్ నిహారిక తోమర్ తెలిపారు. మార్గంలోని ఇరుకైన ప్రదేశాల్లో యాత్రికులు ఒకరి వెనుక ఒకరు వరుసలో నడవాలని సూచనలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తుంగనాథ్ ధామ్ వద్ద భక్తుల మధ్య ఘర్షణలు జరుగుతున్నట్లు చూపే వీడియోలు వైరల్ అవుతున్నాయని, ఈ సంఘటనలకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**రోడ్లపై ట్రాఫిక్ జామ్– భక్తుల ఇక్కట్లు**

ఉత్తరాఖండ్‌లో ప్రస్తుతం చార్‌ధామ్ యాత్ర కొనసాగుతోంది. ఈ యాత్ర కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ భారీ జనసందోహం ప్రభావం రోడ్లపై స్పష్టంగా కనిపిస్తోంది. చార్‌ధామ్ యాత్రా మార్గాల్లో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. దీంతో యాత్రికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ట్రాఫిక్ చిక్కులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బద్రీనాథ్ ధామ్ యాత్రతో పాటు హేమకుండ్ సాహిబ్ యాత్ర కూడా ఇప్పుడు ప్రారంభమైంది. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మరింత పెంచింది. గత నాలుగు రోజులుగా జోషీమఠ్– మార్వారీ రోడ్డు మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో చార్‌ధామ్ యాత్రికులు, హేమకుండ్ సాహిబ్ వెళ్లే భక్తులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. చార్‌ధామ్ యాత్ర సందర్భంగా పెరిగిపోతున్న ఈ జనసమూహం, వాహనాల రద్దీ వల్ల ఏర్పడుతున్న నిరంతర ఒత్తిడి పోలీసులను, స్థానిక యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

# ‘సర్’పై అప్రమత్తంగా ఉండండి

-మొదటిపేజీ తరువాయి

శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలిసారి హైబ్రిడ్ విధానంలో మహానాడు ఘనంగా జరిగిందని హర్షం వ్యక్తంచేశారు. ఇందులో భాగస్వాములైన నేతలు, కార్యకర్తలను అభినందించారు. ఇకపై ఇలాంటి కార్యక్రమాలు మరింత సమర్థంగా జరిపేందుకు ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్ఓపీ) రూపొందించాలని సూచించారు. మహానాడు స్ఫూర్తితో ప్రతి మూడు నెలలకు ఒకసారి క్లస్టర్ స్థాయిలో వర్చువల్ సమావేశాలు నిర్వహిద్దామని సీఎం తెలిపారు. మహానాడులో ఆమోదించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి బుధవారం పార్టీ కార్యక్రమం ఉండేలా క్యాలెండర్ రూపొందించాలన్నారు. ఒక వారం నియోజకవర్గ స్థాయి సమావేశాలు జరిగితే, మరో వారం జిల్లా స్థాయి సమావేశాలు జరగాలని ఆయన స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఈసారి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహానాడు బాగా జరిగిందని అధినేతకు నాయకులు వివరించారు. తెలంగాణలో ఏయే జిల్లాల్లో ఎలా నిర్వహించారో తెలియజేశారు.

**తెలంగాణపై బక్కని నర్సింలు వ్యాఖ్యలు సరికాదు**

మహానాడులో తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింలు చేసిన వ్యాఖ్యల్ని చంద్రబాబు తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ‘తెలుగువారు ఎక్కడున్నా తెలుగుజాతి ఒక్కటే. ఏ ఒక్కరి మనోభావాలూ దెబ్బతినేలా మాట్లాడకూడదు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై. అక్కడ తెదేపాకి ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. తెదేపా ఆవిర్భావం తర్వాతే తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి’ అని చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణలో మహానాడును ఉత్సాహంగా నిర్వహించిన పార్టీ నాయకులు, శ్రేణులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

# రైల్వేజోన్‌కు సర్వం సిద్ధం

స్వర్ణసాగరం విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన ‘దక్షిణ కోస్తా రైల్వే జోన్’ ఆవిర్భావానికి సర్వం సిద్ధమైంది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త జోన్ ప్రారంబోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించాలని రైల్వే బోర్డు భావిస్తోంది. విశాఖ నుంచి ఏదైనా కొత్త రైలు ప్రారంభించినప్పుడు భారీగా ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు ఒక్క రోజే గడువు ఉండటంతో అనుబంధ జోన్లు, డివిజన్ల పరిధిలో ఆదివారం సెలవుని రద్దు చేసి విధులకు హాజరవ్వాలని రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. 1వ తేదీన జరిగే ప్రారంబోత్సవంలో పాల్గొనేందుకు దక్షిణ కోస్తా జోన్ పరిదిలోని డీఆర్ఎంలు విశాఖకు వస్తున్నారు.దీనిపై నేడు డెక్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీఎంల అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు.

**క్షేత్ర స్థాయి పనుల్లో రైల్వే ఉద్యోగులు**

జూన్ 1 నుంచి ప్రారంభం కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాట్లలో జాప్యం జరగకుండా ఉండేందుకు రైల్వేబోర్డు ఆయా డివిజన్ల పరిధిలో ఆదివారం సెలవును రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి ఉద్యోగీ విధిగా విధులకు హాజరుకావాలని స్పష్టం చేసింది. పరిపాలన, క్షేత్ర స్థాయి పనులపై పూర్తి దృష్టి సారించింది. ప్రారంబోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్న నేపథ్యంలో, కొత్త జోన్ పరిధిలోకి వచ్చే గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్ల రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) శనివారం విశాఖ జోన్ జీఎం సందీప్ మాథుర్‌తో సమావేశమయ్యారు. మరోవైపు రైల్వే బోర్డు అధికారులకు దక్షిణ కోస్తా, తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వే జీఎంలు, డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఆస్తులు విభజనపై ఈ భేటీలో చర్చించారు.

**కొత్త బోర్డులతో హద్దుల మార్పు**

జోన్ ప్రారంభానికి సమయం దగ్గరపడటంతో క్షేత్రస్థాయిలో పనులు ఊపందుకున్నాయి. కొత్త జోన్ సరిహద్దులను ఖరారు చేస్తూ, పాత బోర్డుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. విశాఖపట్నంలో ఉన్న రైల్వే కార్యాలయాలు, కల్యాణమండపాలు, ఇతర భవనాల వద్ద ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ స్థానంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ అని మారుస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగుల హడావుడితో జోన్ కార్యాలయంతోపాటు పరిసరాల్లో సందడి నెలకొంది.

**సీపీఆర్వోగా బాలాజీ కిరణ్**

మరోవైపు పాలనాపరమైన కార్యకలాపాలను వేగవంతం చేసే దిశగా రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ కోస్తా రైల్వే సీపీఆర్వోగా బాలాజీ కిరణ్‌ను నియమించింది. ఒక పక్క క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు, మరోపక్క పరిపాలనా విభాగాల కూర్పుతో జోన్ కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యేందుకు అంతా సిద్ధమైంది. రద్దీకి అనుగుణంగా విజయవాడ, గుంటూరు, గుంతకల్లు నుంచి అదనపు రైళ్లు, వందేభారత్ కనెక్టివిటీ పెంచేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. జూన్ 1 నుంచి జోన్ అమల్లోకి రాగానే వైజాగ్ -- సికింద్రాబాద్ వందేభారత్‌తోపాటు పలు రైళ్ల నిర్వహణ, అడ్మిని?రస్టేషన్ కంట్రోల్ మొత్తం విశాఖ కేంద్రంగా జరగనుండటంతో ప్రయాణికులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందనున్నాయి.

**కొత్త రైల్వే జోన్‌లోకి స్వాగతం!**

మధిర: ఏపీలోని విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. అంతేకాక దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొనసాగిన విజయవాడ డివిజన్‌ను కొత్తజోన్‌లోకి మార్చారు. అలాగే, ఇన్నాళ్లు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని మధిర, తొండల గోపవరం, ఎర్రుపాలెం రైల్వేస్టేషన్లను విశాఖ జోన్, విజయవాడ డివిజన్ పరిధిలోకి బదలాయించారు.

ఈ నిర్ణయం సోమవారం నుంచి అమల్లోకి రానుండగా.. మధిర మండలం బయ్యారం సమీపాన కొత్త జోన్ పరిధిని సూచిస్తూ సిబ్బంది శనివారం బోర్డు ఏర్పాటు చేశారు. కాగా, ఇన్నాళ్లు రైల్వే ఉద్యోగులు, ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం సికింద్రాబాద్ వెళుతుండగా.. ఇకపై జీఎంను కలవాలంటే విశాఖకు, ఇతర అధికారులను కలిసేందుకు విజయవాడ వెళ్లాల్సి ఉంటుంది. తెలంగాణ పరిధిలోని మూడు రైల్వేస్టేషన్ల పరిధి ఉద్యోగులు, ప్రజలు పాలనపరమైన అంశాల్లో ఇబ్బంది ఎదురవుతుందని ఆందోళన చెందుతున్నారు.

# కోస్తాజిల్లాల్లే వైసీపీ టార్గెట్

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం మరోసారి ప్రధాన చర్చగా మారుతోంది. ముఖ్యంగా జనసేన పార్టీ ఏర్పాటైన తర్వాత కాపు వర్గంలో రాజకీయంగా కొత్త మార్పులు కనిపించాయి. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో పాటు తమ సమస్యలను ప్రస్తావించే వేదికగా జనసేనను భావించే వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ కారణంగా గత కొన్నేళ్లుగా కాపు వర్గం పెద్ద ఎత్తున జనసేనకు మద్దతుగా నిలుస్తోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.ఈ పరిస్థితి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి రాజకీయంగా సవాలుగా మారిందనే చర్చ కొనసాగుతోంది. కాపు వర్గం ఒకే దిశలో నిలిస్తే భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వర్గాన్ని రాజకీయంగా తటస్థంగా మార్చేందుకు వైసీపీ వ్యూహాలు సిద్ధం చేస్తోందనే ప్రచారం జరుగుతోంది.ఇటీవల వరకు కూటమి రాజకీయాలపై వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మధ్య విభేదాలు వస్తాయని సోషల్ మీడియా వేదికలతో పాటు బహిరంగ సభల్లో కూడా వ్యాఖ్యలు వినిపించాయి. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం కూటమి కొనసాగుతుందని, వ్యక్తులు మారినా లక్ష్యం మారదని స్పష్టం చేశారు. దీంతో కూటమిలో చీలికలు సృష్టించే ప్రయత్నాలు ఫలించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కాపు వర్గాన్ని మళ్లీ ఉద్యమాల దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాపు రిజర్వేషన్లు, సామాజిక హక్కులు, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలను మళ్లీ ప్రస్తావనలోకి తీసుకురావాలనే ఆలోచన కొంతమంది నేతల్లో ఉందని చెబుతున్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో కాపు ఉద్యమం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చగా నిలిచింది. ఆ సమయంలో రిజర్వేషన్ల కోసం



ఆందోళనలు కూడా జరిగాయి.అయితే తర్వాత పరిస్థితులు మారిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు ఉద్యమం నెమ్మదించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తమ తరఫున పోరాడతారనే నమ్మకం కాపు వర్గంలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇదే అంశం ఇప్పుడు వైసీపీకి ఇబ్బందిగా మారిందనే ప్రచారం కూడా జరుగుతోంది.దీంతో కాపు వర్గంలో మళ్లీ భిన్న అభిప్రాయాలు వచ్చేలా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారనే చర్చ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో కొన్ని వర్గాలతో చర్చలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేలా ఉద్యమాలను ప్రోత్సహించే వ్యూహం అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.అయితే ఈ ప్రచారాలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. కానీ కాపు వర్గం రాజకీయంగా ఎటు వైపు నిలుస్తుందన్నది భవిష్యత్ ఎన్నికల్లో కీలక అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కాపు ఓటు బ్యాంక్ చుట్టూనే అనేక వ్యూహాలు తిరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది.

## వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు మరిన్ని అవసరం

-మొదటిపేజీ తరువాయి

డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దాలంటే ప్రతి 100 కిలోమీటర్లకు ఒక వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ అవసరమని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును శనివారం ఆయన సందర్శించారు. చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్‌ను ఎలా ఉత్పత్తి చేస్తున్నారు, చివరకు బూడిదను ఇటుకలుగా ఎలా మారుస్తున్నారో ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ ఎం.వి.చారి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ‘రాష్ట్రంలో నిత్యం 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోంది. కొండవీడు జిందాల్ ప్లాంటు 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. విశాఖపట్నం జిందాల్ ప్లాంట్ నుంచి 15 మెగావాట్ల విద్యుత్ వస్తోంది. ప్రభుత్వం రాష్ట్రంలో ఈ తరహా ప్లాంట్లు మరో ఆరింటిని ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కాకినాడలో పనులు ప్రారంభించగా, నెల్లూరు, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో ఏర్పాట్లు చేస్తున్నామ’ని వివరించారు. బయో మిథలైజేషన్ ప్లాంట్ల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడంపై అధ్యయనం అవసరమని పవన్ పేర్కొన్నారు. పంచాయతీ అధికారులకు శిక్షణ: గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించనున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ‘గోదావరిలోకి వ్యర్థాలు రాకుండా అరికట్టే ప్రణాళికలు వేస్తున్నాం. అక్కడ చెత్త నిర్వహణకు జిందాల్ అనుసరిస్తున్న విధానాలు అమలుచేస్తాం. నది వెంబడి 268 పంచాయతీల్లో చెత్త నిర్వహణ, సుందరీకరణపై అధికారులకు శిక్షణ ఇస్తాం’ అని వివరించారు. ‘సింగపూర్ వినియోగించే విద్యుత్‌లో 2.9% చెత్త నుంచి ఉత్పత్తి అవుతోంది. అక్కడ 90 శాతం చెత్తను మండించి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. టాంజాంగ్ టెర్మినల్‌లో మాదిరిగానే విశాఖ పోర్టులోనూ చెత్తను మండించే విధానంపై యోచిస్తున్నామ’ని పవన్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరపాలక సంస్థ అనుసరిస్తున్న చెత్త నిర్వహణ పద్ధతులను రాష్ట్రంలోనూ ప్రవేశపెడతామని చెప్పారు. ఆయన వెంట పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, తదితరులున్నారు.

**నల్లమలలో ఏఎస్ఐ సర్వేకు అనుమతులు**

నల్లమల అటవీ ప్రాంతంలోని చారిత్రక శాసనాలు, సాంస్కృతిక వారసత్వ సంపద గుర్తింపు, సంరక్షణ కోసం సర్వే చేసేందుకు భారత పురావస్తు సర్వేక్షణ సంస్థకు (ఏఎస్ఐ) రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ సర్వేలో ప్రధానంగా తెలుగు, దేవనాగరి లిపిల్లో ఉన్న శాసనాలపై దృష్టిసారించనున్నారు. వీటి ఆధారంగా ప్రాచీన రాజ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, దక్షిణ భారతదేశ చరిత్రపై లోతైన అధ్యయనం చేయటానికి అవకాశం లభిస్తుంది. వన్యప్రాణుల భద్రత, అటవీ సంరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా ఈ సర్వేకు అవసరమైన సహకారం అందించాలని అటవీ శాఖ అధికారులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ‘నల్లమలలో ఏఎస్ఐ చేపట్టే సర్వే వల్ల పర్యావరణ పర్యాటకం (ఎకో టూరిజం) అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. ప్రకృతి సంపదతో పాటు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, దాన్ని భావితరాలకు అందించే విషయంలో ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకెళ్తోంది. గతంలో వైఎస్సార్ కడప జిల్లాలోని లంకమల అటవీ ప్రాంతంలో ఏఎస్ఐ నిర్వహించిన సర్వేలో క్రీస్తు పూర్వం 1 నుంచి క్రీస్తు శకం 16వ శతాబ్దం వరకూ సంబంధించిన సుమారు 30 శాసనాలు, 10 వేల సంవత్సరాల కిందటి గుహల చిత్రాలూ వెలుగులోకివచ్చాయి. వీటి ద్వారా విలువైన సమాచారం అందుబాటులోకి వచ్చింది’ అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

స్వర్ణసాగరం అమరావతి

రాష్ట్రంలో యోగాంధ్ర-2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జూన్ 7 నుంచి 14 రోజులు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణపై ఉండవల్లి నివాసంలో మంత్రులు, అధికారులతో శనివారం సమీక్షించారు.

**రాజధానిలో.. కృష్ణానది వంతెనపై యోగా**

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమం రాజధాని అమరావతిలో 25వేల మందితో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలో కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జిపై ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. యోగాంధ్ర కార్యక్రమాల వివరాలను ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

జిల్లా కేంద్రాల్లో వెయ్యిమందితో జూన్ 21న నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు.

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అదనంగా మరో లక్షమందికి ట్రైనర్లుగా శిక్షణ ఇస్తారు.

ఒక జిల్లాకు ఒక థీమ్‌తో 14 రోజులు యోగాంధ్ర నిర్వహిస్తారు. ఇందుకు జిల్లాకు రూ.25లక్షల చొప్పున కేటాయించారు.

ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ పర్యాటక ప్రాంతాల చొప్పున.. 56చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి.

14 రోజుల పాటు పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు- స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు అవార్డులు అందిస్తారు.


**హాయ్ అని మెసేజ్ పెడితే.. యోగా వీడియోలు**

రాష్ట్రప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారు మంతెన సత్యనారాయణరాజు యోగాంధ్రపై రూపొందించిన గోడపత్రికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాల వీడియోలు, రోజువారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై ఏడు వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టనున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపినా, ఈ వీడియోలు వస్తాయన్నారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయిప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళ భద్రత పై అవగాహన సదస్సు

**మల్లి పూల సెంటర్ కాలనిలో నిర్వహణ**

**చరవాణి లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని - ఎస్సై నిఖిల్ బాబు వినతి**



స్వర్ణసాగరం వాకాడు

మండల కేంద్రంలోని బీసీ కాలనీ మల్లెపూలు సెంటర్ వద్ద జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష లో మహిళల భద్రతపై వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపై యువత జాగ్రత్తలు తీసుకోవాలని చరవాణి లో వచ్చే ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్ లాంటి వాటికి స్పందించకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు ఏర్పాటు శక్తి యాప్పు మీ చరవాణి లో డౌన్లోడ్ చేసుకుని ప్రమాదం సంబవించినప్పుడు చరవాణిని మూడుసార్లు ఊపితే పోలీసువారికి మెసేజ్ వస్తుందని మేము కాపాడడానికి వీలు ఉంటుందని వాకాడు ఎస్సై నిఖిల్ బాబు అన్నారు. బిసి వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ వల్లి ప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ పిల్లలను చూసుకుని బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారు ఎవరితో మాట్లాడుతున్నారు ఏం చేస్తున్నారు అని పిల్లలపై శ్రద్ధ ఉంచాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబ్జాన్ భాష, కానిస్టేబుల్ రమణయ్య, ఓబులేసు, భాస్కర్, మహిళ పోలీస్ కుసుమ, రామచంద్ర, ఆ కాలనీ మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు విరమణ దినోత్సవం పై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం





తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే30

హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ సిసిఎస్పి నెల్లూరు ప్రాజెక్టు మరియు కోడూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో శరత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ లోని సిబ్బందికి మరియు వర్కర్ వర్కర్స్ కు ప్రపంచ పొగాకు విరమణ దినోత్సవ సందర్భంగా వారికి పొగాకు సేవించడం ద్వారా వచ్చే ప్రాణాంతక వ్యాధులను గురించి వివరించడం జరిగింది పై కార్యక్రమమునకు సిసిఎస్ ప్రాజెక్ట్ మెడికల్ ఆఫీసర్ అవగాహన కల్పించడం జరిగింది. మరియు కోడూరు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ హే నా గ్రేస్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల ను వినియోగించుట ద్వారా కలిగే దుష్పరిణామాలు గురించి వివరించడం జరిగినది. అందులో భాగంగా పీహెచ్సీ సిబ్బంది సి హెచ్ ఓ రమేష్ గారు, ఎం పి హెచ్ ఎస్ సతీష్ , మరియు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది. సిద్ బృందం సిసిఎస్పి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ మరియు డాక్టర్ దీప్తి వారి బృందం, అలాగే శరత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ ఆర్ మేనేజర్ పాల్సన్ , పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు

# దిగు పుత్తూరు దళితులకు ఇంటి స్థలాలకు భూములు ఇవ్వండి..

## సిపిఎం డిమాండ్

స్వర్ణ సాగరం కె వి బి:



కె వి బి పురం మండలం దిగువ పుత్తూరు దళితులకు సర్వేనెంబర్ 61/2 పి లోని ప్రభుత్వ భూమి సుమారు 19 ఎకరాలు ఉండగా అందులో 12 ఎకరాలను గ్రామస్తులు వారి అవసరాల కోసం పోగా మిగిలిన 7 ఎకరాలు భూమిని దళితులకు ఇంటి స్థలాలకు దళితుల అవసరాలకు కేటాయించాలని సిపిఎం పార్టీ జిల్లా వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .దిగువ పుత్తూరు లోని ప్రభుత్వ భూమిని సిపిఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు స్థానిక దళితులతో కలిసి శనివారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఒక గ్రామంలోని ప్రభుత్వ భూమి కేవలం అగ్రకులాల వారికే సొంతమేనా? దళితులకు గిరిజనులకు హక్కు లేదా అని ప్రశ్నించారు. సర్వే నంబర్ 61/2జూ లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇప్పటికే 12 ఎకరాలకు పైగా గ్రామస్తులు ఇంటి స్థలాలకు పాఠశాలకు గిరిజనుల ఇండ్ల స్థలాలకు ఇతర అవసరాలకు కేటాయించుకుని ఉన్నారని గుర్తు చేశారు. మిగిలిన 7 ఎకరాల భూమి నైనా దళితులకు వారి భవిష్యత్తు అవసరాలకు ఇంటి స్థలాలకు సామాజిక అవసరాల కొరకు సదరు భూమిని దళితులు స్వాధీనపరచుకుంటే అది తప్పు అయినట్లు గ్రామంలోని అగ్ర కులస్తులు పోలీసులను పిలిపించి దళితులపై దౌర్జన్యంగా ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని, రెవెన్యూ అధికారుల చేత సెక్షన్ 166 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం ప్రకారం( గతంలో 145 సెక్షన్) విధించి ఎవరిని భూమి లోకి పోనువ్వ కుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. చట్టం అధికారులు రాజ్యాంగం ప్రకారం బలహీనులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు . లాంటి చట్టమే నేడు అగ్రకులాలకు సాయపడే విధంగా దళితులకు నష్టపరిచే విధంగా సెక్షన్ 166 పెట్టడం దళితులను అణచివేయాలని చూడడం దారుణం అన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు వారు విధించిన నిషేధపు చట్టం 166 ను తొలగించి మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని దళితులకు స్వాధీనపరిచి ఇంటి పట్టాలకు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవి గోపి గ్రామంలోని ప్రజలందరూ పాల్గొన్నారు.

# కెనరా బ్యాంకు వారి సౌజన్యంతో రూ.4 లక్షలు ఆర్థిక భరోసా



నెల్లూరు స్వర్ణ సాగరం మే30

సూళ్లూరుపేట కేఆర్ పి కాలనీ కి చెందిన డి.జయంతి రోడ్డు ప్రమాదం కారణంగా మృతి చెందింది. ఈమె గురించి బ్యాంక్ లో విచారించగా ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన(పిఎంఎస్ బివై), ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన రెండు యాక్టివ్ లో ఉన్నట్లు తెలిసింది. దీనికిగాను సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యతా కౌన్సిలర్స్ బ్యాంకు లో క్లెయిమ్ చేశారు. దీని ద్వారా రూ.4 లక్షలు రూపాయలు అమౌంట్ సెటిల్మెంట్ అయ్యింది. పిఎమ్ఎస్ బివై మరియు పీఎంజెజెబివై ద్వారా రూ.4 లక్షలు రూపాయలు చెక్కును భర్త హరికృష్ణ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టి. కరుణానిధి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన మరియు ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన అందరూ చేసుకోవాలని భవిష్యత్తులో జరిగే అకాల సంఘటనలకు మీ కుటుంబాలకి చేయూత కలిగే విధంగా భరోసా కల్పిస్తుంది అని తెలియజేసినారు. ఈ స్కీమ్స్ ఇప్పుడు రెన్యూవల్ అవుతాయి కాబట్టి అందరు మీ అకౌంట్ లో డబ్బులు ఉంచుకొనేలా చూసుకోవాలని తెలియజేశారు. పై కార్యక్రమంలో సూళ్లూరుపేట కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ టి. కరుణానిధి, మేనేజర్ మహేష్,బ్యాంకు సిబ్బంది నాగేంద్ర బాబు, వెంకటేశ్వర్లు మరియు సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ ముని చంద్ర, పరమానందం పాల్గొన్నారు.

# భక్తులకు సౌకర్యార్థం చల్లటి నీటిని అందజేస్తున్న ఆలయ అధికారులు



కాణిపాకం, స్వర్ణ సాగరం మే 30

కాణిపాకం వేసవి కారణంగా భక్తులకు చల్లటి నీటిని అందజేత. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ, క్యూ లైన్లో పోటెత్తిన భక్తులు, భక్తుల సౌకర్యార్థం వేసవి తపం కారణంగా మాడా వీధులలో కూలింగ్ మినరల్ వాటర్ ని మొబైల్ ట్యాంకులతో భక్తులకు పంపిణీ చేయడం జరిగింది, పంపిణీ కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించి భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ .

# మరుపూరూ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన బొబ్బేపల్లి



పొదలకూరు స్వర్ణ సాగరం మే30

సర్వేపల్లినియోజకర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు నియోజకవర్గంలోని పొదలకూరు మండలం మరుపూరు గిరిజన కాలనీ నందు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది జనసేన పార్టీ అధ్యక్షులు మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నెలలో ప్రతి శనివారం ఒక మండలం ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో పంచాయతీ కాలువల క్లీనింగ్ మరియు బ్లీచింగ్ కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించే విధంగా కొన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈరోజు మరుపురు గిరిజన కాలనీలో కాలవల్లో బ్లీచింగ్ కొట్టించడం జరిగింది ఇదేవిధంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని 117 పంచాయతీలో ఉన్నటువంటి ప్రతి ఒక్క జన సైనికుడు తమ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కాలువలు స్కూల్స్ దేవాలయాలు చర్చిలు ఎక్కడెక్కడ అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు వేయబడతాయో అక్కడ అంతా కూడా వాటిని బహిర్గతంగా వేయకుండా అవగాహన చర్యలు చేపట్టాలని పిలుపునిస్తున్నాం రాష్ట్రం కోసం రైతుల కోసం పేదల కోసం నిరంతరం కృషి చేసేటువంటి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా ఆయన తీసుకున్న శాఖలో ప్రధానమైనది పంచాయతీరాజ్ శాఖ కాబట్టి గ్రామపంచాయతీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో మన వంతు మన కృషి చేస్తూ ప్రజలకు చేరువలో ఉండాలని ఉంటారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం... ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల నాయకులు కొమ్మల ప్రసాద్ కార్తీక్, వంశీ, శ్రీను, వెంకటాచల మండల కార్యదర్శి సందూరు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు..



తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# తోటపల్లి గూడూరు ఖ్యాతిని విస్తరించిన సాహితీవేత్త వేత్త "శేషేంద్ర శర్మ "కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో "వర్ధంతి"వేడుకలు



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే30

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు గ్రామానికి చెందిన అభ్యుదయ కవి గుంటూరు శేషేంద్ర శర్మ వర్ధంతి వేడుకలు శనివారం కుటుంబ సభ్యులు బంధుమిత్రులు సాహితీ ప్రియులు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన శేషంద్ర శర్మ 1927 అక్టోబర్ 20న జన్మించారు. ఆయన రచనల ద్వారా తోటపల్లి గూడూరుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. తెలుగు కవి విమర్శకులు వక్త సంస్కృత ఆంధ్ర భాషల్లో పండితులువిదేశీ భాషలను అనువదించిన మేధావి వచన కవిత్వం పద్య రచన ల ద్వారా సాహితీపరులను అలరించారుఆయన రచనలు మండే సూర్యుడు ఈ దేశం నా ప్రపంచం గొరిల్లా రామాయణ రహస్యాలు సోడసిసాహితీవేత్తలను అలరించాయి.. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహించారు సాహితీ ప్రపంచానికి మార్గదర్శకుడైన శేషేంద్ర శర్మ 2007 మే30 నపరమపదించారుఆయన మన మధ్య లేకపోయినప్పటికీ ఆదర్శకవిగా ప్రజా హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు

# "మల్లికార్జునపురం" "వాగు పొలాలకు" రహదారి "మహర్దశ"

## రూ 3 లక్షలతో గ్రావెల్ రోడ్డు

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 30

మండలంలోని మల్లికార్జునపురం వాగు కాల్వ భూముల సాగుదారుల రైతుల కలలు నెరవేరడంతో రైతులు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

ఈ వాగు కింద 30 ఎకరాల రైతులు 117 మంది సాగు చేసుకుంటున్నారు చాలాకాలంగా తమ పొలాలలోకి వెళ్లేందుకు సక్రమమైన రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు కూటమి ప్రభుత్వం రావడంతో రైతులు రహదారి విషయాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ నిధులు రూ 3 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు ప్రస్తుతం ఈ గ్రావెల్ రోడ్డు నిర్మాణం రూపుదిద్దుకుంటుంది ఈ గ్రావెల్ రోడ్డు ద్వారా రైతులు తమ పొలాల్లోకి నేరుగా రాకపోకలు సాగేందుకు వీలైంది

# ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటం

## మనుబోలు లో పర్యటించిన సీపీఎం నేతలు





మనుబోలు,స్వర్ణ సాగరం :

మండలం పరిధిలో ని చెర్లోపల్లి, కుడితిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను సీపీఎం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, మండల కార్యదర్శి తలారి దేవదానం శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు పని ప్రదేశంలో కూలీలతో నేరుగా సమావేశమై, వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, పని పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా కూలీలు పడుతున్న కష్టాలను వారు దగ్గరుండి పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అన్న విషయాలపై వారితో చర్చించారు.క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం, ఉపాధి హామీ పనుల వద్ద అమలు చేస్తున్న 'ఫేస్ యాప్' (హాజరు విధానం) పై నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా ఈ యాప్ కూలీలకు పెద్ద తలనొప్పిగా మారిందని, దీనివల్ల పని గంటలు వృథా అవ్వడమే కాకుండా, హాజరు పడటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు ఆరోపించారు.ఈ సందర్భంగా మంగళ పుల్లయ్య మాట్లాడుతూ, "ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సాంకేతిక విధానాలు కూలీలకు భారం కాకూడదు. కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తూ, యాప్ల పేరుతో కూలీలను ఇబ్బంది పెట్టడం సరికాదు," అని అన్నారు.పని ప్రదేశాల్లో తాగునీరు, కనీస సౌకర్యాలను యుద్ధ ప్రాతిపదికన కల్పించాలి.సాంకేతిక సమస్యలు సృష్టిస్తున్న ఫేస్ యాప్ విధానాన్ని సరళీకరించాలి లేదా ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలి.కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలి.ఈ కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## గణనాధుని గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



కాణిపాకం, స్వర్ణ సాగరం మే 30

గణనాధుని గో సంరక్షణ ట్రస్టుకు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానం గోసంరక్షణ ట్రస్ట్ కి విరాళం 1,01,116రూపాయలు (చెక్కు) దాత చల్లగుండ్ల సుదర్శన్ , వారి కుటుంబ సభ్యులు కాణిపాకం, కాకర్లవారిపల్లె, వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

## కొయ్యలగూడెం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి



కొయ్యలగూడెం స్వర్ణసాగరం

పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు చేతుల మీదుగా కొయ్యలగూడెంలో ఈరోజు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.మండలానికి చెందిన 12 మంది నిరుపేద లబ్ధిదారులకు సంక్షేమ సహాయంగా మొత్తం రూ. 838246/- రూపాయలు విలువైన చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ,అనారోగ్యం మరియు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి పేదవాడికి టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎంఆర్ఎఫ్ నిధులు పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పారెపల్లి రామారావు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఆరేటి వీర పండు, డైరెక్టర్ పెన్యాల రమాదేవి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు ఆకుల అరుణ,మండల ప్రధాన కార్యదర్శి చిటికిన బాలగంగాధర్ తిలక్, టౌన్ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల శేషారావు,చింతల వెంకటరమణ, గంగిరెడ్ల మేఘాల దేవి,క్లస్టర్ ఇంచార్జ్ కొత్త రమా,చెరుకూరి రమ్య నల్లూరి గోపి,బొబ్బర రాజు గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మగడ్డ రాంబాబు, సుదగాని సత్యనారాయణ, ముప్పనపల్లి వెంకటేశ్వరావు,ఎపుగుంట గ్రామ కమిటీ అధ్యక్షులు సాధనల బూసిబాబు, టీ. నరసాపురం తెలుగుయువత అధ్యక్షులు కల్నిడి వాసు,ఉప్పాడ పెద్దిరెడ్డి, బీజేపీ నాయకులు బోలిశెట్టి నాగు,టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పారెపల్లి పవన్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "జన్ జాతీయ" గరిమాఉత్సవ్ లోయానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి"పొట్లూరికి"సన్మానం



నెల్లూరు స్వర్ణ సాగరం మే 30

జన్ జాతీయ గరిమ ఉత్సవ్ 2026 సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విశాఖపట్నం నగరంలో ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ ట్రైనింగ్ మిషన్లో ఆంధ్రప్రదేశ్లో సోషల్ సర్వీస్ కమ్యూనిటీ లీడర్షిప్ ఎడ్యుకేషన్ కల్చర్ ట్రెడిషనల్ నాలెడ్జ్ ఇన్నోవేషన్ గ్రాస్ రూట్ డెవలప్మెంట్ విభాగాలలో సేవలు అందిస్తున్న ప్రముఖ గిరిజన నాయకులను సన్మానించి పురస్కారాలు అందజేశారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాలో యానాదులకు వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న గిరిజన నేత యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి మిషన్ డైరెక్టర్ మందారాణి ఆయనను శాలువా మెమెంటుతో సత్కరించి అభినందించారు ఈ సందర్భంగా పొట్లూరి శ్రీనివాసులు రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరించాలని మందా రాణికి విజ్ఞప్తి చేశారు

## ద్రౌపతి దేవి తిరణాల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



స్వర్ణ సాగరం ఏర్పేడు :

ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో జరుగుతున్న ద్రౌపదీ దేవి తిరునాళ్లలో ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్య క్రమంలో ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు, బత్తల గిరి నాయుడు తదితరులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పాతవీరాపురం గ్రామ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# తోటపల్లి గూడూరులో మాజీ మంత్రి కాకాణి







తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 30

మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాకాణిగోవర్ధన రెడ్డి శనివారం మండలంలోనికామాక్షి నగర్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ స్వాతి రమేష్ ఇంటికి వెళ్లడంతో పాటుతోటపల్లి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం రవిచంద్ర ఇంటికి వెళ్లి కార్యకర్తలతో స్థానికరాజకీయ పరిస్థితులనుసమీక్షించారు.తోటపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాయపు నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.పనిలో పనిగాకూటమి ప్రభుత్వ విధానాలను విమర్శించారు.గ్రామాలలో తన పర్యటన సందర్భంగా గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి అమలైన సంక్షేమ కార్యక్రమాలు గురించి చర్చించుకోవడం జరుగుతుందన్నారుజగన్మోహన్ రెడ్డి అధికారంలో లేకపోయిన ప్రతికీప్రజల హృదయాలలో నిలిచిపోయారని తెలిపారు అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజలకు పిలిస్తే పలుకుతూ అందు బాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాలలోమండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్రాష్ట్ర వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చిల్లకూరు సుధీర్ రెడ్డిజడ్పిటిసి శేషమ్మరామా చార్యులుతలమంచి సురేంద్రబాబు మన్నెంసుబ్రహ్మణ్యం గౌడ్ మన్నెంచిరంజీవి గౌడ్ వైయస్సార్సిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తాం





### పి కే యం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

స్వర్ణ సాగరం రామకుప్పం మే 30

మండల పరిధిలోని నానియాల గ్రామ సరిహద్దుల్లో మామిడి తోటలోకి ఏనుగులు గుంపు ప్రవేశించి ధ్వంసం చేయడంతో విషయం తెలుసుకున్న పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు అక్కడకి చేరుకుని ఏనుగుల వల్ల జరిగిన పంట నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తగిన నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు అలాగే గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏనుగుల సంచారం ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్త పాటించాలని కోరారు ననియాలలో సోలార్ కంచకు మరమ్మత్తులు చేపడతామని ఏనుగుల దాడిలు ఎక్కువగా జరుగుతున్న నానియాల తాండ నారాయణపురం తండా పంద్యాలమడుగు గ్రామాల చుట్టూ కొత్తగా తొమ్మిది కిలోమీటర్ల సోలార్ కంచ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ఫారెస్ట్ రేంజర్ యూనిట్ ఇన్చార్జి గజేంద్ర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు లోకేష్ నాయుడు జి ఎస్ బాబు వేణు గంగాధర్ త్యాగరాజు రాము నాయక్ రైతులు టిడిపి పార్టీ నేతలు పాల్గొన్నారు

## హిమాలయ గురూజీ కి ఘన స్వాగతం పలికిన వేణు ముదిరాజ్





రేణిగుంట స్వర్ణ సాగరం మే 30

హిమాలయ పర్వతాలలో నిరంతరం తపస్సులో నిమగ్నమై ఉండే పూజ శ్రీ హిమాలయ గురూజీ భారతదేశ సంపూర్ణ పాదయాత్రలో భాగంగా గుడిమల్లం లోని శ్రీ పరుశురామేశ్వర స్వామి దర్శనార్థం శనివారం ఉదయం వెళుతుండగా మార్గం మధ్యలో రేణిగుంట మండలం కుర్రకాలువ వద్ద భారతీయ జనతా పార్టీ ఓ బి సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వేణు ముదిరాజ్ ఆధ్వర్యంలోని భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని మాజీ సర్పంచ్ రాణమ్మ, గ్రామస్తులు ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం గుడిమల్లం చేరుకున్న స్వామి వారిని ఆలయ మర్యాద తో స్వాగతం పలికి దర్శనం అనంతరం సత్కరించారు. గాజుల మండ్యం లోని శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయ రెడ్డి గురూజీని ఆలయ మర్యాదతో సత్కరించి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా గురూజీ వస్తున్నారన్న సమాచారంతో గ్రామ గ్రామాన భక్తులు వేచి ఉండి స్వాగతం పలికి, గురూజీ ఆశీర్వాదాలు పొందారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి మాట్లాడుతూ 2025 జూలైలో శ్రీశైలం నుంచి పాదయాత్ర ప్రారంభించిన గురూజీ గుజరాత్‌లోని గిరినార్, కాశి, రామేశ్వరం క్షేత్రాలను సందర్శించి తిరిగి హిమాలయాలకు చేరుకుంటారని అన్నారు. రేణిగుంట, ఏర్పేడు పరిసర గ్రామాల ప్రజల శ్రేయస్సు కొరకు గుడిమల్లం లోని శ్రీ పరుశురామేశ్వర స్వామి ఆలయానికి స్వామీజీ చేరుకున్నారని అన్నారు. గురూజీ ఇప్పటివరకు 7000 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేశారని తెలిపారు. అఖండ భారత స్థాపన, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో గురూజీ ఈ పాదయాత్ర చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంగల్రాయలు, నాగమ్మ, దేవేంద్ర, మధు, చంద్ర, తేజ, నీరు, పార్వతమ్మ, శివమ్మ, హరి, పవన్, సాయి, బక్కప్ప, ధనుష్, యోగి, ప్రేమ్, సుబ్బు, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గుర్రై మరణించిన యశ్వంత్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే 'కిలివేటి సంజీవయ్య'!



స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 30.

నాయుడుపేట మండలం పరిధిలోని కారుమంచి వారి కండ్రిగ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు గుర్రై అకాల మరణం చెందిన తొప్పాని యశ్వంత్ నివాసానికి శనివారం సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు శ్రీ కిలివేటి సంజీవయ్య వెళ్లారు యశ్వంత్ మృతితో తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయిన ఆయన తండ్రి రవికుమార్ తో పాటు కుటుంబ సభ్యులను సంజీవయ్య కలిసి, వారిని ఆప్యాయంగా ఓదార్చి పరామర్శించారు. యశ్వంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిడుగుపాటుకు గుర్రై చనిపోవడం అత్యంత బాధాకరమని, యశ్వంత్ కుటుంబానికి వైఎస్ఆర్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.. ఈ పరామర్శ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ నాగిరెడ్డి లక్ష్మీ ప్రసన్నకుమార్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు పాలేటి నాగార్జున, నెల్లూరు వంశీ తదితర వైఎస్ఆర్సీపీ కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.

# పొగాకుతో ప్రాణహాని

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

ప్రతి సంవత్సరం మే 31 వ తారీఖున జరిగేటటువంటి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్ మరియు ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం పై శనివారం అవగాహన సదస్సు మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ పొగాకు మరియు దాని ఉత్పత్తుల అయినటువంటి సిగిరెట్లు, బీడీలు, పొగాకు, పాన్ పరాగులు, గుట్కాలు, హాన్సులు మొదలగునవి పట్ల యువత ఎక్కువగా ఆకర్షితులై సేవించడం వలన హృదయ సంబంధిత రోగాలు ఊపిరి సంబంధిత రోగాలు నోటి క్యాన్సరు ,గొంతు క్యాన్సరు ,టిబి ,మొదలగు జబ్బుల బారిన పడి అనారోగ్య పాలై మరణిస్తున్నారు.. అనంతరం డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులే కాకుండా వాటిలో మత్తు పదార్థాలు కెమికల్స్ కలిపి తయారు చేసే పదార్థాలను నానా రకాలుగా నోటి ద్వారా తీసుకోవడం వలన పైన తెలిపిన జబ్బులన్నీ వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నందున ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన కలిగి ఈ పొగాకు ఉత్పత్తులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి జీవితాలను కుటుంబాలను సమాజాన్ని కాపాడవలసినదిగా మంచి ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించాలని అందరూ ఈ ప్రతిజ్ఞ ప్రకారము నడుచుకోవాలని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణసాగరం



# అధైర్య పడకండి.. మరో రుద్రమదేవిగా అవతరిస్తా ...





## - కార్యకర్తలకి ధైర్యం నూరిపోసిన సమన్వయకర్త కృపా లక్ష్మి

శ్రీరంగరాజపురం: స్వర్ణ సాగరం: మే 30 :

వైఎస్ఆర్సిపి అనుమాయిలు గా ఉన్న ఓటర్లను తొలగించుట కూటమి ప్రభుత్వం పలు రకాలుగా " సర్ "అనే జీవోను తెచ్చి కుట్రపూరితంగా సిద్ధపడుతోందని, అలాంటి వాటిని కార్యకర్తలు గుర్తించి నాకు చేరవేస్తే అడ్డుకోవడానికి మరో "రుద్రమదేవి"గా పోరాటం చేస్తా నని గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపా లక్ష్మి కార్యకర్తలకి ధైర్యం నూరి పోశారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి మిట్ట దీపిక కళ్యాణ మండపంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ బూత్ లెవెల్, కార్యకర్తల అవగాహన కార్యక్రమం చిత్తూరు జిల్లా ఉమ్మడి వై ఎస్ ఆర్ సి పి పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశం మొత్తం మీద కరుడుగట్టిన ముఖ్యమంత్రులు ఓడిపోవడానికి కారణం "సర్ "అనే ఆయుధాన్ని ఉపయోగించి, ప్రజల మనోభావాలను దెబ్బ దెబ్బతీస్తున్నారని, ఇది



ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల సంఘం సర్ అనే జీవోను తెచ్చి పేద,మధ్య స్థాయి ఓటర్లను తొలగిస్తుండటమే ఈ సర్ ఉద్దేశం అన్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రిలు ఓటమికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మన పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందస్తుగానే ఒక అవగాహనకు వచ్చా నన్నారు. అందులో భాగంగానే నేడు పార్టీఅధినేత ఆదేశాల మేరకు బిఎల్ఏలు ప్రతి 350 కుటుంబాలలో ఉన్న ఓటర్ల ను వ్యక్తిగతంగా పరిచయం చేసుకుని, క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. గత ఎన్నికల్లో చేసిన పొరపాటును మరలా మరలా చేయకుండా ఉండడానికి మన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ముందస్తుగానే కార్యకర్తలకు హెచ్చరికలు జారీ చేశారన్నారు. అలాగే గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైయస్సార్సీ పార్టీకి పెట్టని కోటగా ఓటర్లు ఉన్నారనన్నారు.

**నియోజకవర్గ అవినీతిని వెలికి తెద్దాం..** కూటమి పాలనలో గత రెండు సంవత్సరాలకే అవినీతి పెచ్చు మీరు పోయిందన్నారు. గడచిన రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఉన్న టిడిపి నాయకులు... అవినీతి సంపాదనలో పోటీపడి.. ఒకరికి ఒకరు పై ఎత్తు గా... తనదైన శైలిలో దోపిడీ జరుగుతుండడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనను నియోజక ప్రజలు గమనించి రానున్న స్థానిక ఎన్నికల్లో ఎక్కడా కూడా ఏకగ్రీవం జరగకుండా పోటీ చేయాలని పిలుపునిచ్చారు. దాదాపు నియోజకవర్గం ఒక సర్పంచ్ అభ్యర్థిగా, జిల్లా ప్రాదేశిక, మండల ప్రదేశిక ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థి పోటీ ఉంటుందని, ఎక్కడ రాజీ ప్రయత్నాలకు ఆవ కాశం లేదన్నారు. నాకు పెద్దలైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, విజయానందరెడ్డి అడుగు జాడల్లో నడుచుకుంటూ నని సభా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సి ఎం నారాయణస్వామి , మాజీ ఎంపీ, నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్లు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, ఆరు మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, బి ఎల్ ఏ లు, తదితరు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కలవకూరులో పౌర హక్కుల దినం



పెళ్లకూరు స్వర్ణసాగరం మే 30.

మండలంలోని కలవకూరు గ్రామం గిరిజన కాలనీ నందు శనివారం స్థానిక తహసిల్దార్ హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు కలిసి పౌరహక్కుల దినం నిర్వహించారు. సమాజంలో అందరూ రాజ్యాంగబద్ధంగా సమానమని, ఎక్కువ తక్కువ అనే తారతమ్యం లేకుండా అందరూ సమానమేనని వెల్లడించారు. దేవాలయాల్లో అందరికీ ప్రవేశం, పూజలు చేసుకునే అవకాశం ఉందన్నారు. తాగునీటి బోర్ల వద్ద, తాగునీటి కుళాయిల వద్ద, ఆలయ ప్రవేశాల్లో కుల వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలతో అందరూ ఐకమత్యంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మనోజ్ కుమార్, వెంకయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ సాయి లక్ష్మి, వెలుగు సిసి కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

## వినుకొండలో విమర్శల వేడి



వినుకొండ స్వర్ణసాగరం

పల్నాడు జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వినుకొండ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలే రాజ్యమేలాయని ఆరోపించారు.వినుకొండ అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని బొల్లాపై జీవీ విమర్శలు సంధించారు. అధికార మార్పు జరిగినప్పటికీ అక్రమాల నీడ ఇంకా కొనసాగుతోందని, ప్రభుత్వ భూముల వ్యవహారాల్లో ఫోర్జరీ పత్రాలు, నకిలీ జీవోలతో భారీ కుట్రలు జరిగాయనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు తప్పదని హెచ్చరించారు.అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను జీవీ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలకు కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.గత పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందుకే అభివృద్ధి-విధ్వంసం మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గుర్తించారని జీవీ వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో చోటుచేసుకున్న వ్యవహారాలపై విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. జీవీ చేసిన ఈ వ్యాఖ్యలు వినుకొండతో పాటు పల్నాడు జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

## లోకేశ్‌పై జగన్‌ది రాజకీయ కక్ష.. ప్రత్తిపాటి

చిలకలూరిపేట స్వర్ణసాగరం



అమరావతి, మే 30: మంత్రి నారా లోకేశ్ పెరుగుతున్న రాజకీయ ప్రభావాన్ని చూసి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలకు తెరలేపారని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో లోకేశ్ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుండటంతో ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే మార్గం లేక వైసీపీ కొత్త కథనాలను సృష్టిస్తోందని ఆరోపించారు.ఐదేళ్ల పాలనలో జగన్ చేయలేకపోయిన పనిని లోకేశ్ కొద్ది నెలల్లోనే చేసి చూపించారని, 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ద్వారా వేలాది నిరుద్యోగ కుటుంబాల్లో ఆశలు నింపారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రజల్లో లోకేశ్‌కు పెరుగుతున్న ఆదరణ, యువతలో ఏర్పడుతున్న విశ్వాసమే వైసీపీని కలవరపెడుతోందని అన్నారు.డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్, వాటికి సంబంధించిన ఒక్క ఆధారమైనా చూపించగలరా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నిజంగా అవకతవకలు జరిగి ఉంటే న్యాయపరంగా పోరాడకుండా కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కావడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. ప్రజల దృష్టిని మరల్చడానికే వైసీపీ నేతలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు.మరోవైపు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని లోకేశ్ చేసిన ప్రకటన ఆయన దూరదృష్టికి నిదర్శనమని ప్రత్తిపాటి కొనియాడారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్న లోకేశ్‌కు రాష్ట్రవ్యాప్తంగా మహిళల మద్దతు మరింత పెరుగుతోందని, అదే భవిష్యత్ రాజకీయాల్లో ఆయనను మరింత బలమైన నాయకుడిగా నిలబెడుతుందని వ్యాఖ్యానించారు. జగన్ విమర్శలు ఎంత పెరిగినా, లోకేశ్ ప్రజాదరణను అడ్డుకోలేవని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

## ఐజి అభినందనలు



గుంటూరు

దక్షిణ కోస్తా జోన్ పరిధిలో విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన 24 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా (సీఐలు) పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అభినందించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించిన అధికారులకు ఈ పదోన్నతులు దక్కడం అభినందనీయమని ఐజీ పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ప్రతి పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు.పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాలని, చట్ట అమలులో నిష్పాక్షికత, క్రమశిక్షణ, సేవాభావం పాటించాలని ఆయన సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన, నేర నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత వంటి అంశాల్లో మరింత అప్రమత్తంగా పనిచేయాలని కోరారు.పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఐజీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు ఐజీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గోవధ నిషేధం పైతట్టు గొల్లపాలెంలోపోలీస్ అవగాహన సమావేశం



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 30

మండలంలోని తట్టు గొల్లపాలెం లో శనివారం తోటపల్లి గూడూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వీరేంద్రబాబు సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామస్తులకుఆవుల వధపైగ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గోవధచట్టరీత్య నేరమని పేర్కొన్నారు.పోలీసుల సూచనను పాటించాలన్నారు

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పై అవగాహన ర్యాలీ



పూతలపట్టు స్వర్ణ సాగరంమే 30

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా శనివారం పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఎం బండపల్లి సచివాలయంలో ప్రజలతో ర్యాలీ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సంకల్పం పొగాకు కి శాశ్వత వీడ్కోలు సిగరెట్ మిమ్మల్ని కాల్చకముందే మీరు సిగరెట్ కాల్చడం మానేయండి పొగాకు రహిత సమాజం కోసం కలిసి ముందడుగు వేయాలి ఆరోగ్యాన్ని కాపాడండి పొగాకు దూరం పెట్టండి ధూమపానం మానేయండి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే నినాదాలు చేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు, సిగరెట్ బీడీ చుట్ట ద్వారా వచ్చే పొగ పీల్చే వారికి కూడా క్యాన్సర్ ఒప్పందని ఒక అలవాటు ఉన్నవారు ఆ వ్యసనము నుండి విముక్తి పొందాలని చెప్పారు పొగాకు ఉత్పత్తులైన బీడీ సిగరెట్ హాన్స గుట్కా దుగ్గ వాడవద్దని ప్రజలలో పొగాకు వలన కలిగే అనార్థాలపై వచ్చే వ్యాధులైన ఊపిరితిత్తుల క్యాన్సర్ నోటి క్యాన్సర్లు లివర్ క్యాన్సర్లు బ్లడ్ క్యాన్సర్లు మొదలు పొగాకు వలన కలిగే అనేక వ్యాధులు గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ప్రమీల ,ఆశ కార్యకర్తలు నిత్య ,రెడ్డమ్మ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

## సి ఓ ఈ ఎంట్రన్స్ పరీక్షల్లో బ్రిలియంట్ పాఠశాల విద్యార్థుల విజయకేతనం



స్వర్ణ సాగరం డోర్నకల్ మే 30

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న సిఓఈ కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో డోర్నకల్ బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు విజయ కేతనాన్ని ఎగురవేశారు. మే 15న జూనియర్ ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ పొందుటకు నిర్వహించబడిన ఎంట్రెన్స్ పరీక్షలలో బ్రిలియంట్ విద్యార్థులు టాప్ ఫోర్ కాలేజీలలో అడ్మిషన్ పొందారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ లో మొదటి స్థానంలో గౌలిదొడ్డి హైదరాబాద్, రెండో స్థానంలో కరీంనగర్, మూడో స్థానంలో ఎలుకతుర్తి హనుమకొండ, నాలుగో స్థానంలో అసన్ పర్తి వరంగల్ కాలేజీలలో జె.మేఘన కాలేజ్ ఆఫ్ ఎక్సలెంట్ గౌలిదొడ్డి, ఎం సంకీర్తన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ కరీంనగర్, ఏ అమూల్య కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎల్కతుర్తి, ది మేఘన కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ హసన్పర్తి వరంగల్ కాలేజీలలో అడ్మిషన్లు పొందారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఒక్కతుల అప్పారావు, మాట్లాడుతూ బ్రిలియం పాఠశాలలో ఆరో తరగతి నుంచి నిర్వహించబడుతున్న ఐఐటి ఫౌండేషన్ మరియు మా యొక్క ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు కృషి ఫలితమే నేడు కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ లో అడ్మిషన్ పొందారాని కొనియాడారు. ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థిని విద్యార్థులను శనివారం కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు

## విద్యుత్ మోటార్ చోరి- ఫిర్యాదు


పెళ్లకూరు, స్వర్ణ సాగరం మే 30.

వ్యవసాయ మోటార్ చోరీ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని చెన్నప్పనాయుడు పేట గ్రామానికి చెందిన మల్లాం మణి అనే రైతు తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న 40వేలు విలువ చేసే వ్యవసాయ విద్యుత్ మోటార్ ను గుర్తు తెలియని దుండగులు అపహారించారాని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన స్థానిక ఎస్సై దారం ఆదిలక్ష్మి ఈ ఘటనపై విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



## ఓటీటీలో దూసుకెళ్తున్న 'డ్రింకర్ సాయి'

ధర్మ మహేష్ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ మహేశ్ హీరోగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 2024 డిసెంబర్‌లో థియేటర్స్‌లో విడుదలై యావరేజ్ టాక్ సంపాదిం చుకుంది. కానీ దాదాపు ఏడాదిన్నర ఓటీటీలోకి వచ్చి.. ఇక్కడ మంచి టాక్‌తో దూసుకెళ్తోంది. జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ఫ్రీ ఆన్ జీ5 విభాగంలో టాప్-1 ట్రెండింగ్ మూవీగా దూసుకుపోతూ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమాలో ఒక సాధారణ యువకుడి జీవితంలో జరిగే పరిణామాలను, అతని ప్రేమ, ఆత్మగౌరవం, భావోద్వేగ సంఘర్షణలను ధర్మ మహేష్ ఎంతో నేచురల్‌గా నటించారు. కొన్ని కీలక సన్నివేశాల్లో ఆయన ఎక్స్‌ప్రెషన్స్, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. అందుకే థియేటర్లలో మంచి పేరు తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో మరింత పెద్ద స్థాయిలో ఆదరణ పొందుతోంది. అలాగే ఈ చిత్రంతో బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా దుబాయ్‌లో జరిగిన గామా అవార్డ్ అందుకున్నారు ధర్మ మహేష్. హీరోయిన్‌గా నటించిన ఐశ్వర్య శర్మ తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఆమెకు ధర్మ మహేష్‌తో ఉన్న కెమిస్ట్రీ సినిమాకు మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అలాగే రీతూ చౌదరి, పోసాని కృష్ణ మురళీ, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, భద్రం, కిర్రాక్ సీత, ఫన్ బకెట్ రాజేష్, రాజ ప్రజ్వల్ తదితరులు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేసి కథను మరింత బలపరిచారు.




## సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో మ్యూజికల్ కామెడీ.. 'రోమాంచకం' ఫస్ట్ లుక్ రిలీజ్

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్' (రాజూఅతీత్) 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లలో ప్రభాస్ షర్ట్‌లెస్ లుక్‌లో, ఒంటిపై గాయాలు, బ్యాండేజీలతో కనిపించి అభిమానుల్లో భారీ అంచనాలను పెంచేశారు. లాంగ్ హెయిర్, గడ్డం, మీసాలతో ఉన్న ప్రభాస్ లుక్.. సందీప్ వంగా మునుపటి చిత్రం 'యానిమల్'లో రణబీర్ కపూర్ లుక్‌ను గుర్తుచేసేలా ఉందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాలో తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు.

## రూ.300 కోట్ల క్లబ్‌లోకి 'కరుప్పు'.. బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న సూర్య డివైన్ బ్లాక్‌బస్టర్




తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాల విజయవంతమైన రన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మూడో వారంలోకి కూడా అదే జోరుతో అడుగుపెట్టింది. సాధారణంగా పెద్ద సినిమాల వసూళ్లు రెండో వారానికే తగ్గుముఖం పడుతుంటాయి. కానీ 'కరుప్పు' మాత్రం వీక్‌డేస్‌లో కూడా బలమైన కలెక్షన్లు నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జి.కె. విష్ణు అందించిన అద్భుతమైన విజువల్స్ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. మూడో వారంలో కూడా థియేటర్లలో బలమైన ఆక్యుపెన్సీ కొనసాగుతుండటంతో ఈ చిత్రం ఫైనల్ రన్ ముగిసే సమయానికి మరిన్ని చారిత్రాత్మక రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్య కెరీర్‌లోనే కాకుండా, తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

## 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్ రిలీజ్.. జూన్ 22 నుండి స్ట్రీమింగ్!




హాలీవుడ్ పాపులర్ ఫాంటసీ డ్రామా సిరీస్ 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. వెస్టరోస్ సామ్రాజ్యంలో ఐరన్ థ్రోన్ కోసం జరిగే భీకర పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. రక్తపాతం లేకుండా కింగ్స్ ల్యాండింగ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రైలర్ ప్రారంభంలో రాన్యా టార్గేరియన్ చెప్పినప్పటికీ, పరిస్థితులు దానికి భిన్నంగా మారి ఆమె తన డ్రాగన్లు, సైన్యంతో నగరాన్ని ముట్టడించడం, అది అగ్నికీలల్లో చిక్కుకోవడం ఇందులో చూపించారు. ముఖ్యంగా అత్యంత రక్తపాతంతో కూడిన నౌకా యుద్ధంగా పేరొందిన 'బాటిల్ ఆఫ్ ది గల్లెట్'ను ఈ సీజన్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ క్రేజీ సిరీస్ భారతదేశంలో జూన్ 22 నుంచి 'జియోహాట్‌స్టార్' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## యాక్షన్ మోడ్‌లో కరిష్మా కపూర్.. ఆసక్తికరంగా 'బ్రౌన్' ట్రైలర్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, "రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఆమెలో ఎన్నో లోపాలు, బలహీనతలు ఉన్నప్పటికీ, జీవితంలో ముందుకు సాగే పట్టుదల ఉంది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి" అని పేర్కొన్నారు. అలాగే నటుడు జిష్షూ సేన్‌గుప్తా మాట్లాడుతూ, ఈ సిరీస్ కేవలం ఒక సాధారణ సస్పెన్స్ థ్రిల్లర్‌లా కాకుండా, ప్రతి పాత్రలోనూ ఎంతో లోతు, భావోద్వేగాలు ఉంటాయని, కోల్‌కతా నగరం ఈ కథలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచిందని చెప్పారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.

